క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

గూడూరురూరల్: పట్టణంలోని న్యూబాలాజీ నగర్‌లో బుధవారం లయన్స్ క్లబ్ గూడూరు, న్యూబాలాజీ నగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ రాజేష్, డాక్టర్ సుగుణమ్మ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్ర, డిస్ట్రిక్ట్ చైర్మన్లు వాకాటి రామ్మోహన్‌రావు, శీనయ్య, కోశాధికారి వీరేంద్రనాథ్, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవతో పారిశుద్ధ్యం మెరుగు

పెళ్లకూరు: స్వచ్ఛతా హీ సేవతో పారిశుద్ధ్యం మెరుగు పరుచుకునే అవకాశం కలిగిందని ఎంపీడీఓ సురేష్‌బాబు అన్నారు. బుధవారం శిరసనంబేడు సచివాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. వచ్చే నెల 2వ తేదీ వరకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో భాగంగా తాగునీటి కొళాయిలు, బావులు వద్ద చెత్త, చెదారాలు లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాలు శుభ్రం చేసి స్వచ్ఛతను పాటించాలని సూచించారు. గ్రామాల్లో మానవహారం నిర్వహించి అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకరయ్య పాల్గొన్నారు.

60 మందికి కంటి పరీక్షలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని భగవతే మల్లికాంబ ఆలయం వద్ద బుధవారం జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరంలో వైద్యులు సుమారు 60 మందికి ఉచిత కంటి పరీక్షలు చేశారు. వీరిలో 10 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసి, చెన్నై శంకర నేత్రాలయకు తీసుకువెళుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ చైర్మన్ ఏ వెంకట సుబ్బయ్య, ఓటుకనాథస్వామి, మల్లికార్జున, రామానారాయణ, శంకర్ నేత్రాలయ వైద్యులు వెంకటముని పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

పెళ్లకూరు: జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి ఆక్రమణల తొలగింపు వేగవంతానికి చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ రామయ్య తెలిపారు. బుధవారం టెంకాయతోపు, చిల్లకూరు గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు పనులకు సంబంధించి నిర్వాసితులతో ఆయన మాట్లాడారు. బాధితులందరికీ పరిహారం చెల్లించినట్లు చెప్పారు.

అవగాహన కల్పించండి

చిల్లకూరు: గ్రామాల్లో సన్న, చిన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలు సాగు చేసుకునే అవకాశంపై అవగాహన కల్పించాలని ఏపీఓ గిరి సూచించారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో బుధవారం క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సన్న, చిన్న కారు రైతులు పండ్ల తోటలు, మల్లె, మునగ, నిమ్మ, ఉసిరి, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నాయుడుపేటటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం నుంచి మున్సిపాలిటీలోని ఎల్‌ఏ సాగరం, లోతువానిగుంట, బీఎంఆర్ నగర్, భూపయ్య కాలనీ, గిండివారి తోట, మునిరత్నం నగర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లలో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

నాయుడుపేట: ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలు తమ జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని ఏపీఓ షీలా బాను తెలిపారు. నాయుడుపేట మండలం వేముగుంటపాళ్లెంలో కూలీలకు ఆధార్ అనుసంధానంపై అవగాహన కల్పించారు. ఆధార్ కార్డు అనుసంధానంతో నగదు చెల్లింపులు ఉన్న నేపథ్యంలో కూలీల ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేశామన్నారు.

ఆరోగ్య సురక్షకు ప్రత్యేక బృందాలు

చిల్లకూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 14 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో వచ్చే నెల 5వ తేదీ నుంచి నెలాఖరు వరకు నిర్వహించే ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ మస్తానయ్య, ఆర్‌ఐ రమ్యస్వాతి, ఎంపీడీఓ నిర్మలాదేవి, ఈఓపీఆర్‌డీ మాణిక్యం, ఏఓ శ్రీనివాసరావు సభ్యులుగా ఉంటారన్నారు.

కండలేరులో 12.521 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 12.521 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 845 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 25, లోలెవల్ స్లూయిస్‌కు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక సుగంధం

ఎల్లలు దాటిన భక్తి వేదిక అది. తమ కోర్కెలను షేక్ దావూద్ షావలీ తీర్చుతారని ఏటా కుల, మతాలకతీతంగా అక్కడికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. మదిలో భక్తి పులకింత..దివ్యానుభూతి.. ఆ ఆధ్యాత్మిక నందనంలో ఆనంద చందన పరిమళాలను భక్తులు ఆస్వాదించే వేళ ఆసన్నమైంది. ఈ నెల 22న వేనాడు షేక్ దావూద్ షావలీ దర్గాలో గంధోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ప్రత్యేక కథనం.


- మహిమాన్వితం.. వేనాడు దర్గా
- 22న గంధోత్సవం
- గ్రామస్తులే పెద్దలుగా..
- కుల,మతాలకతీతంగా ఉత్సవం


వేనాడు దర్గా(ఫైల్)

తడ: మహిమాన్విత దర్గాగా వేనాడు షేక్ దావూద్ షావలీ అల్లా దర్గా పేరుగాంచింది. దర్గాలో 28వ గంధోత్సవం(రబ్బీయుల్ అవ్వల్) ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 16వ తేదీన దర్గా వద్ద జెండా(నిషాన్) స్థాపనతో గంధోత్సవానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. వేనాడు గ్రామంలో సుమారు 620 ఏళ్ల కిందట బాబా నివసిస్తూ, ఇక్కడే సమాధి అయినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఆయన భక్తుల కోర్కెలు తీర్చుతారన్న నమ్మకం ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా చుట్టు పక్కల రాష్ట్రాలు, సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు తరలి వచ్చి, ఆసియాలోనే అతి పెద్దదైన 144 అడుగుల పొడవున్న బాబా దర్గాను కుల, మతాలకతీతంగా దర్శించుకుంటారు. అమావాస్య రోజున దర్గాలో కదలికలు వస్తుంటాయని, ఆ రోజు దర్గా వద్ద నిద్ర చేస్తే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో దర్గాలో అమావాస్య రోజున వేలాది మంది భక్తులు వచ్చి నిద్ర చేస్తుంటారు. బాబా దర్గాతోపాటు సమీపంలోనే ఉన్న బాబా చెల్లెలుగా భావించే వహీదాబీ దర్గాను కూడా భక్తులు సందర్శిస్తుంటారు. గ్రామంలో ముస్లింలు ఒక్కరు కూడా లేన్నప్పటికీ హిందువులే భక్తిశ్రద్ధలతో దర్గా నిర్వహణ చేపడుతున్నారు.

కడప నుంచి పుష్పాలు

గంధోత్సవం సందర్భంగా కడప నుంచి ముస్లింలు పుష్పాలను తీసుకురావడం ఆనవాయితీ. తెల్లవారుజామున గ్రామంలోని ఉత్సవ కమిటీ పెద్ద ఇంటి వద్ద నుంచి సుందరంగా అలంకరించిన ప్రత్యేక రథంపై గంధాన్ని దర్గా వరకు ఊరేగింపుగా తీసుకువెళతారు. దర్గాలో పూజా కార్యక్రమాలు నిర్వహించే ముజావర్లు అప్పటికే పాత చద్దర్(దర్గాపై ఉండే వస్త్రం) తొలగించి, కొత్త చద్దర్ కప్పి ఉంచుతారు. దర్గాకు చేరుకున్న గంధాన్ని 144 అడుగుల దర్గాపై పూసి మరో వస్త్రంతో కప్పడం ద్వారా గంధోత్సవం పూర్తవుతుంది. మిగిలిన గంధాన్ని భక్తులకు పంచుతారు. ఈ సందర్భంగా గతంలో దర్గా వద్ద విద్యుద్దీపాలంకరణ, పాట కచ్చేరీలు, ఖవాళీ పోటీలు నిర్వహించడంతో ఉత్సవం ఎంతో ఘనంగా ఉండేది. ఈ ఏడాది అలాంటి పరిస్థితులు లేకుండా దర్గా ఆనవాయితీ ప్రకారం మాత్రమే గంధం ఉంటుంది.


గంధం ఊరేగించే ప్రత్యేక రథం (ఫైల్)

గతం ఎంతో ఘనం

గతంలో ఎంతో ఘనంగా గంధోత్సవం నిర్వహించినప్పటికీ గత కొన్నేళ్లుగా ప్రకృతి వైరీత్యాలతో గంధోత్సవం కొంత నిరాశాజనకంగా సాగుతోంది. తుపాన్‌లు, కరోనా తదితర విపత్తులతోపాటు గ్రామంలో నెలకొన్న విభేదాల కారణంగా ఈ ఏడాది కూడా దర్గా ముజావర్ ముష్టియార్, గ్రామ పెద్దల సమక్షంలో పెద్దగా హడావుడి లేకుండా గంధోత్సవం నిర్వహించనున్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు


వెంకటగిరి రూరల్: లబ్ధిదారుకు బుక్‌లెట్ ఇస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: నవరత్న పథకాల ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి మున్సిపాలిటీ బంగారుపేటలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ బాలయ్య, ప్రముఖ న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు పీ సుబ్బారావు, ఏ శంకరయ్య, వహిద, నేతలు వీ కృష్ణయ్య, ఏ కాంతారావు, నరసయ్య, కాటయ్య, వీవర్స్ సొసైటీ అధ్యక్షులు శివకుమార్, ఎం శ్రీనివాసులు, నాగరాజు, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం

దక్కిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వివక్ష లేని పాలనతో నిరుపేద కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం దిగువలింగసముద్రం, చాకలపల్లె, నాయుడుపాళెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీ రాజశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్ కోటేశ్వరరావు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, వీ మల్లికార్జున, పరంధామనాయుడు, చంద్రయ్య, కే సుధాకర్, మాధవనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు పీ దశరథరామిరెడ్డి, జీ శ్రీనివాసులు, డీ రవీంద్రారెడ్డి, బీ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దక్కిలి: నాయుడుపాళెంలో బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి

ఆధునిక వసతులతో కూరగాయల మార్కెట్


మటన్, ఫిష్ మార్కెట్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: పట్టణంలోని ఐసీఎస్ రోడ్డులో ఆధునిక వసతులతో కూరగాయల మార్కెట్ నిర్మించామని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. గూడూరులోని ఐసీఎస్ రోడ్డులో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అలాగే మటన్, ఫిష్ మార్కెట్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరులో కూరగాయల మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి రూ.2 కోట్ల నిధులతో ఆధునిక వసతులతో మార్కెట్ నిర్మించామని చెప్పారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

గూడూరులోని సాధుపేట సెంటర్ నుంచి చల్లకాలువ వరకు రూ.20 లక్షలు జీజీఎంపీ నిధులతో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, మురళి, గోపి, మహేంద్ర, జేసీఎస్ మండల కన్వీనర్ రాఘవరెడ్డి, అల్తాఫ్, అజీజ్‌ఖాన్, మాజీ కౌన్సిలర్ రమీజా, బిక్కుసాహెబ్, మజాహర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి ఘనంగా పూజలు


బల్లవోలులో అన్నదానం చేస్తున్న దాతలు

చిల్లకూరు: మండలంలో పలు గ్రామాల్లో మూడో రోజు గణనాథునికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. బల్లవోలులో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డీ కిరణ్‌కుమారెడ్డి, ఎం అమరనాథ్‌రెడ్డి, డీ చంద్రారెడ్డి, పీ శ్రీనివాసులరెడ్డి, పీ వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల్లో ఆనందం


పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్‌రాజు

ఓజిలి: కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు ఆనందంగా ఉండారని ఎంపీటీసీ సభ్యుడు వై ప్రసాద్‌రాజు అన్నారు. మండలంలోని చిలమానుచేనులో భువనగిరిపాళెం, పెద పరియ, చిలమానుచేను గ్రామాల్లో కొత్తగా మంజూరైన 22 కొత్త పింఛన్ల నగదును బుధవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పీ సాయిరాం, సీ హంసవేణి, జీ సుధ, నేత పీ మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

దొరవారిసత్రం: పూలతోట సచివాయం పరిధిలోని చవటకండ్రిగ, కట్టువాపల్లె, వడ్డికండ్రిగ తదితర గ్రామాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింట సర్వే చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి బయోమెట్రిక్ తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సింగయ్య, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి తనిఖీ చేశారు.

ఖ్యాతి పెంపొందేలా జాతర నిర్వహణకు సన్నాహాలు

వెంకటగిరిరూరల్: పోలేరమ్మ ఖ్యాతి మరింత పెంపొందించేలా ఈ ఏడాది వైభవంగా జాతర నిర్వహణకు సన్నహాలు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోలేరమ్మతల్లి మొదటి చాటింపునకు రాజాల వద్ద అనుమతి తీసుకున్న జాతర పనిబాట్లవారు బుధవారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతాగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బంగారుపేట సచివాలయం వద్ద ఇండియన్ స్వచ్ఛత లీగ్ ర్యాలీని నేదురుమల్లి జెండా ఊపి, ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ బాలయ్య, కౌన్సిలర్లు సుబ్బారావు, శంకరయ్య, వహిత తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 30న స్టూడెంట్ ఫోరం ఏర్పాటు

గూడూరురూరల్: పట్టణంలో అక్టోబర్ 30వ తేదీన ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం అనుబంధంగా స్టూడెంట్ ఫోరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ ఫోరం జాతీయ అధ్యక్షుడు దేగ రవి రాఘవేంద్ర తెలిపారు. గూడూరులోని ఫోరం కార్యాలయంలో బుధవారం స్టూడెంట్ ఫోరం కరపత్రాలను విడుదల చేశారు. అయన మాట్లాడుతూ ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో ఐదేళ్లుగా అనేక ప్రజాసమస్యలపై పోరాటం చేశామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఫోరానికి అనుబంధంగా స్టూడెంట్ ఫోరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఫోరానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉద్దాల మణికుమార్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ, బీసీ, విద్యార్థి విభాగాల రాష్ట్ర అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర్లు, బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పీ పెంచలయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు సాంబమ్మ, మండల అధ్యక్షుడు కే వెంకటేశ్వర్లు, నెల్లూరు జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు శ్రీను, బాబు, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షుడు దేగ రవి రాఘవేంద్ర

అందుబాటులో ఎరువులు

సూళ్లూరుపేట రూరల్: వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో రబీ సీజన్ సాగుకు ఎరువులు అందుబాటులో ఉంచామని ఏడీఏ అనిత తెలిపారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లోని వరి నారుమడులను బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వరి, ఇతర పంటలకు 4,600 మెట్రిక్ టన్నుల ఎరువులు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 560 మెట్రిక్ టన్నుల ఎరువులను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు.


నారుమడిని పరిశీలిస్తున్న ఏడీ అనిత

గంగ ఒడికి గణనాథుడు



నాయుడుపేటటౌన్: వినాయక నిమజ్జన ఊరేగింపు

లంబోదరుడు..భక్త జనవల్లభుడు..ఏకదంతుడు.. ఊరూవాడా వెలిశాడు.. మూడు రోజుల పాటు పూజలందుకున్నాడు. భక్తులు సమర్పించిన ఉండ్రాళ్లు ఇష్టంగా ఆరగించాడు. గంగ ఒడికి చేరేందుకు బుధవారం బయలుదేరాడు. బాణసంచాపేలుళ్లు.. డప్పు వాయిద్యాలు.. భక్తుల నృత్యాలు చేస్తూ భక్తగణం వెంటనడవగా సాగిన వినాయక నిమజ్జన సంబరం నింగినంటింది.

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా సాగింది. గణేశుని విగ్రహాలను జై భోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేస్తు తూపిలిపాళెం సముద్రంలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు కూడళ్లలో వినాయక విగ్రహల వద్ద శుక్రవారం అన్నదానం, ఉట్టి కొట్టే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

రూ.45 వేలు పలికిన వినాయకుడి లడ్డూ

గూడూరురూరల్: పట్టణంలోని దిగువవీరారెడ్డిపల్లె లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేలం పాటలో వినాయకుడికి నైవేద్యంగా పెట్టిన ఏడు కిలోల లడ్డూ రూ.45 వేలు పలికింది. దుగ్గన అఖిల్‌కుమార్ యాదవ్, నాలి మధుసూదన్ యాదవ్‌లు ఈ లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు దుగ్గన వినీష్ యాదవ్ పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయకుడి ప్రతిమలు నిమజ్జనానికి తరలిపోయాయి. నెలబల్లి, కుప్పారెడ్డిపాళెం, అక్కరపాక, సింగనాలత్తూరు, నెల్లూరుపల్లి, వేణుంబాకం, సిద్ధాపురం తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను ఆయా గ్రామాల్లోని యువకులు, గ్రామస్తులు ఘనంగా వీధుల్లో ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: పలు గ్రామాల్లో నెలకొల్పిన గణనాథుని విగ్రహాలను తూపిలిపాళెం వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు. మేళతాళాలు, తప్పెట్ల నడుమ వినాయకుని విగ్రహాలను ఊరేగించారు. చిల్లకూరు, పెళ్లకూరు, శిరసనంబేడులో యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. వసంతాలు, వినాయక లడ్డూల వేలం నిర్వహించారు.

రాపూరులో..

రాపూరు: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనాలు వైభవంగా నిర్వహించారు. సిద్ధలయ్య సెంటర్‌లో మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి ట్రాక్టర్లలో వినాయక విగ్రహాలను కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ గ్రామాల్లో ఊరేగించారు.


పెళ్లకూరులో..


రాపూరు: నిమజ్జనం చేస్తున్న యువత


వినాయకుడి లడ్డూను అందుకుంటున్న అఖిల్‌కుమార్ యాదవ్


దొరవారిసత్రం: నెలబల్లిలో..

పౌష్టికాహారంతో ఆరోగ్యం

చిల్లకూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం తిక్కవరం సెక్టార్‌లోని అంకులపాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం ద్వారా గర్భిణులు, బాలింతలు రోజూ పాలు, గుడ్లు, ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పౌష్టికాహారం ప్యాకెట్లను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, కార్యకర్తలు పాల్గొన్నారు.


పౌష్టికాహారం ప్యాకెట్లు అందజేస్తున్న సీడీపీఓ

లారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

నాయుడుపేటటౌన్: మండలంలోని అన్నమేడు వద్ద బుధవారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి లారీని ఢీకొంది. ఈ సంఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి నెల్లూరుకు ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రయాణికులతో బయలు దేరింది. మార్గం మధ్యలో నాయుడుపేట సమీపంలోని అన్నమేడు వద్దకు వచ్చే సరికి రోడ్డు పక్కగా నిలిపి ఉన్న లారీ ఒకసారిగా రోడ్డుపైకి రావడంతో బస్సును డ్రైవర్ అదుపు చేయలేకపోయాడు. దీంతో బస్సు లారీని ఢీకొంది. ప్రమాదానికి కారణమైన లారీ అక్కడ నుంచి వెళ్లిపోయింది. ట్రావెల్స్ బస్సు ముందు భాగం దెబ్బతింది. బస్సులో ఉన్న ప్రయాణికులెవరికీ గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


దెబ్బతిన్న బస్సు